ముందుకు సాగని పనులు

- మెండోరాలో పూర్తికాని రోడ్డు నిర్మాణం
- డివైడర్ల పనుల్లో నాణ్యత కరువు
- ఓ చోట కూలిన డ్రైనేజీ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, రోడ్డు పక్కన డ్రైనేజీ పనులు ముందుకు సాగడం లేదు. రోడ్డు వెడల్పు పనులు అక్కడక్కడ నిలిచి పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు వెడల్పు పనులల కోసం రూ.2.5కోట్లను గతేడాది మార్చిలో అప్పటి ప్రభుత్వం మంజూరు చేయగా, అదే నెలలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. సెంట్రల్ లైటింగ్, సీసీ డ్రైనేజీ కోసం గత సెప్టెంబర్‌లో రూ.2 కోట్ల నిధులు మంజూరు కాగా, అప్పుడే పనులను ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. మెండోరా మండల కేంద్రంలో అసలే రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఇళ్ల మెట్లను తొలగించాల్సి వచ్చింది. దీంతో గ్రామస్తులు రోడ్డు వెడల్పు పనుల కోసం తాము ఇళ్లలోకి వెళ్లే మెట్లు కోల్పోయినా సహకరించారు. అయితే పనులు అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్తులు ఇళ్లలోకి వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు. అక్కడక్కడ పనులు పూర్తి కాగా, సొంత ఖర్చులతో మెట్లను నిర్మించుకున్నారు. కానీ క్రాసింగ్‌ల వద్ద


అసంపూర్తిగా ఉన్న రోడ్డుపనులు


ముందుకు సాగని సెంట్రల్ లైటింగ్ పనులు

ఇప్పటికీ రోడ్డు పనులు పూర్తి కాలేదు. డివైడర్ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో చూడడానికే అసహ్యంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ డివైడర్‌కు మరమ్మతులు చేస్తూ సిమెంట్ పూత పూస్తున్నారు. సీసీ డ్రైనేజీ పనుల గురించి చెప్పనక్కర్లేదు. వేసిన నాలుగు రోజులకే ఒక చోట కుప్పకూలి పడిపోగా, మళ్లీ నిర్మించారు.

ఇలా నాణ్యతా ప్రమాణాల విషయంలో ప్రారంభం నుంచి గ్రామస్తులు వేలెత్తి చూపుతున్నారు. మూలిగే నక్క మీద తాటి కాయపడ్డ చందంగా నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం

రోడ్డు వెడల్పు పనులను, సెంట్రల్ లైటింగ్ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. మొక్కలు అందుబాటులో లేక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. మొక్కలు రాగానే నాటి మిగతా పనులను పూర్తి చేస్తాం.

– వినీత్, ఆర్అండ్‌బీ ఏఈఈ, బాల్కొండ

అవిశ్వాసం ప్రచారం అబద్ధం

ఎడపల్లి(బోధన్): ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్‌పై ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టనున్నారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఎంపీపీపై అవిశ్వాసం పెట్టే ప్రసక్తి లేదని ఎంపీటీసీలు స్పష్టం చేశారు. ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ శ్రీనివాస్ గత ఐదేళ్లుగా ఎంపీటీసీలకు ప్రతి పనిలో సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎంపీపీపై రాజకీయ కక్షతో లేని అంశాన్ని తెరపైకి తెచ్చి ఎంపీటీసీల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనకు ఎంపీపీ పదవి మాజీ ఎమ్మెల్యే షకీల్ సహకారంతో వచ్చిందని, ఆయన ఒక్క మాటచెబితే ఇప్పటికప్పుడే రాజీనామా చేస్తానన్నారు. బీఆర్ఎస్‌లో ఉంటూనే అసెంబ్లీ ఎన్నికల్లో వ్యతిరేకంగా పని చేసిన వారిని షకీల్ గుర్తించారని, త్వరలోనే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీటీసీలు మంద సంజీవ్, షేక్ జావిద్ బాబా, స్రవంతి, మనీషారెడ్డి, వనజ, బిల్లా సుమలత, బద్దోళ్ల పద్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం


కిసాన్‌నగర్ సెయింట్ ఎలిజబెత్ పాఠశాలలో..


బోధన్‌లోని లయోల పాఠశాలలో..

బాల్కొండ/బోధన్‌టౌన్: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో సెయింట్ ఎలిజబెత్ ఎయిడెడ్, బోధన్ పట్టణంలోని లయోల పాఠశాలల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. బాల్కొండ జెడ్పీటీసీ దాసరి లావణ్య, సర్పంచ్ మానేటి తులసీ, ఎంఈవో రాజేశ్వర్, సెయింట్ ఎలిజబెత్ కరస్పాండెంట్ మేరీ, లయోల పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్, హెచ్‌ఎం సురేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

- అధికారులు, సర్పంచుల గైర్హాజరు
- 8 మంది ఎంపీటీసీలు, నలుగురు అధికారులతో సాగిన సమావేశం

ఎడపల్లి(బోధన్): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. ఆయాశాఖల అధికారులు, సర్పంచులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో కేవలం నలుగురు అధికారులు, ఎనిమిది మంది ఎంపీటీసీలతో సమావేశం తూతూ మంత్రంగా ముగించారు. ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ అధ్యక్షతన మండలపరిషత్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రణాళికలు సిద్ధం చేయడం, ప్రతి గ్రామంలో పనుల గుర్తింపు, నిధుల ఖర్చుకు ప్రతిపాదనలను తయారు చేసేందుకు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులతో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయగా అధికారులు, సర్పంచులు సమావేశంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. విద్య, వైద్య, వ్యవసాయ శాఖ అధికారులు తప్ప వేరే శాఖల అధికారులు హాజరుకాలే దు. దీంతో ఎంపీటీసీల సమక్షంలో కేవలం మూడు శాఖల అధికారుల నుంచి మాత్రమే ప్రతిపాదనలు తీసుకున్నారు. ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ మా ట్లాడుతూ.. ఎడపల్లి మండలానికి 15 వ ఆర్థిక సంఘం నిధులు


అధికారులు, సర్పంచులు లేక వెలవెలబోతున్న సమావేశపు హాలు

గతేడాదితో పోలిస్తే 50 శాతానికిపైగా తక్కువ కేటాయించారన్నారు. ఆ నిధులతో ఏపని చేపట్టాలన్నా కష్టంగా ఉంటుందన్నారు. నిర్దేశించిన పనులే చేపట్టాలని ఆదేశాలివ్వడం సమంజసం కాదన్నారు. మండలంలో ఉన్న రైతు వేదికలకు కాంపౌండ్ వాల్స్, ఐరన్ కిటికీలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్, టాయిలెట్లు లేని చోట టాయిలెట్లు నిర్మించాలని సమావేశంలో తీర్మానించారు. ఎంపీడీవో గోపాలకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్, మండల విద్యాధికారి రామారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్, జానకంపేట్ ఎంపీటీసీ మంద సంజీవ్, ఎడపల్లి ఎంపీటీసీలు షేక్ జావిద్‌బాబా, స్రవంతి, మనీషారెడ్డి, మంగళ్‌పాడ్ ఎంపీటీసీ వనజ, తానాకలాన్ ఎంపీటీసీ బిల్లా సుమలత, జైతాపూర్ ఎంపీటీసీ బద్దోళ్ల పద్మ పాల్గొన్నారు.

షిర్డీకి పాదయాత్ర

ఎడపల్లి(బోధన్): ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా నుంచి మహారాష్ట్రలోని షిర్డీకి సాయిబాబా భక్తులు పాదయాత్ర చేపట్టారు. వీరి పాదయాత్ర శనివారం ఎడపల్లి మండలంలోని బాపూనగర్ సాయిబాబా ఆలయానికి చేరింది. ఈ సందర్భంగా స్థానిక భక్తులు వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. 23రోజులుగా పాదయాత్ర కొనసాగుతున్నదని, 40 మందిమి షిర్డీకి బయల్దేరామని పాదయాత్రికులు తెలిపారు. 1200 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసి ఫిబ్రవరి19న సాయినాథుడిని దర్శించుకుంటామన్నారు.

రంగనాథస్వామిని దర్శించుకున్న హంపీ పీఠాధిపతి



బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో ఉన్న రంగనాథస్వామి ఆలయాన్ని హంపీ పీఠాధిపతి విరూపక్ష విద్యారణ్యస్వామి శనివారం దర్శించుకున్నారు. ఆలయం భవిష్యత్‌లో ఎంతో అభివృద్ధి చెందుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఏర్పాట్లను పరిశీలించారు. నిర్మల్‌లో గాయత్రి గోశాల పండితుడు ప్రవీణ్, ఆలయ అర్చకుడు వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

ఆర్మూర్‌టౌన్: ప్రగతి నిరోధకంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం నరేందర్, కర్క గణేశ్ అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వ విద్యారంగంపై నయామనువాద, ఉదారవాద దాడులు చేస్తున్నాయన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఫిబ్రవరి 3న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే అషర్, అనిల్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గా ప్రసాద్, కోశాధికారి నిఖిల్, నాయకులు మహిపాల్, మహేశ్, సిద్ధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

బీడీ దాస్‌కు డాక్టరేట్ ప్రదానం



నవీపేట : మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త, వ్యాపారవేత్త భవంతి దేవీదాస్(బీడీ దాస్)కు బెంగళూరులోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రస్తుతం నిజామాబాద్‌లో స్థిరపడిన బీడీ దాస్ తనతండ్రి భవంతి నారాయణ పేరిట ట్రస్టును ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దాస్‌కు డాక్టరేట్ ప్రదానంపై నీలకంఠేశ్వర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు సూదం సాయిలు, మాజీ జెడ్పీటీసీ సాయిబాబాగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచులు



ఖలీల్‌వాడి: నవీపేట్ మండలంలోని మట్టయ్య ఫారం సర్పంచ్ వకలపుడి రాము, అబ్బాపూర్ (ఎం) సర్పంచ్ ఎస్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమయ్యతో పాటు నాగరాజు, పి కృష్ణారావు, శ్రీనివాస్, కృష్ణ తదితరులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో వీరికి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, పులి శ్రీనివాస్‌రావు, మోబీన్‌ఖాన్, గోవర్ధన్‌రెడ్డి, తాడ్‌బిలోలి సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

బోధన్: ఎమ్మార్పీఎస్ టీఎస్ (మేడిపాపన్న వర్గం) పట్టణ నూతన కమిటీని శనివారం పట్టణంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుంజరి నాగయ్య, అధ్యక్షుడిగా బెల్లిడిగ సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా సగ్గ శంకర్, అద్దంకి పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కాళ్ల మహేందర్, కార్యదర్శులుగా నందిగామ శంకర్, ఏదుల భూమయ్య, సహాయ కార్యదర్శిగా పెరవళ్లి వాసు, ప్రచార కార్యదర్శులుగా కోటగిరి సతీశ్, విఠల్, కోశాధికారిగా అద్దంకి రవి, ముఖ్య సలహాదారులుగా డప్పు పోశెట్టి, పురవళ్లి పాపారావు, బండారి యాదగిరి, అద్దంకి నాగరాజ్, గుంజారి జయకృష్ణ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర ప్రతినిధి ఎం.విద్యాసాగర్, జిల్లా, నియోజక వర్గ ప్రతినిధులు దేగాం సాయిలు, వాగ్మారే నాగూరావు, నగేశ్ పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులు

డాక్టర్ రమణాచారి మృతి



ఆర్మూర్‌టౌన్: పట్టణ ప్రజలకు సుదీర్ఘకాలం పాటు వైద్య సేవలందించిన డాక్టర్ రమణాచారి శనివారం ఉదయం మృతిచెందారు. వృద్ధాప్యం కారణంగా వైద్యవృత్తిని విరమించుకొని ప్రస్తుతం హైదరాబాద్‌లో కుమారుని వద్ద ఉంటున్నారు. ఆదివారం ఆర్మూర్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రమణాచారి మృతికి పట్టణ వాసులు సంతాపం తెలిపారు.

బడిబయటి పిల్లల గుర్తింపునకు సర్వే



బోధన్ రూరల్ (బోధన్): బడి బయటి పిల్లల గుర్తింపునకు మండలంలోని సంగం గ్రామంలో శనివారం సర్వే నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, ఒకరిని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ఇద్దరిని అర్బన్ రెసిడెన్షియల్(నిజామాబాద్)లో చేర్పించి మరొకరిని మదర్సాకు పంపించినట్లు సీఆర్‌పీ విజయ్ తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ గిరిధర్ ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, ఉష , రాంచందర్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

వర్ని(చందూర్) : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వృద్ధులు, పేదలకు శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. చలి తీవ్రత దృష్ట్యా దుప్పట్లను పంపిణీ చేసినట్లు క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. రీజినల్ కో ఆర్డినేటర్ శివ నాగేశ్వరరావు, అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సభ్యులు మాధరపు రామ్‌రెడ్డి, ప్యారం అశోక్, జయరాం, సాయిలు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ కోసం పోరాడుదాం


పెర్కిట్ కేజీబీవీలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

ఎడపల్లి/పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్: కేజీబీవీల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌ను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సిబ్బంది డిమాండ్ చేశారు. ఎడపల్లి, ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్, మాక్లూర్ కేజీబీవీల్లో ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో డిమాండ్ల సాధన కోసం పోరాడుతామన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి



మాక్లూర్: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుంటూ వినయ విధేయతతో ఉండాలని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని దాస్‌నగర్ వద్దఉన్న వీఆర్ఈసీలో మినిస్ట్రీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన పేట్రియాటిక్ రన్ కార్యక్రమానికి నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య వృథాకాదన్నారు. అలాగే దేశభక్తి కలిగి ఉన్న ప్రతి విద్యార్థి సమాజ శ్రేయస్సును కోరుకుంటాడన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గణేశ్, శ్రీకాంత్, స్వప్న, వాసు గౌడ్ పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా మార్చుకోవాలి


పాలకవర్గ సభ్యులతో ఎంపీపీ రజిని

రెంజల్(బోధన్): చిన్న గ్రామ పంచాయతీలను పాలకవర్గం సభ్యులు ఆదర్శంగా మార్చుకోవాలని ఎంపీపీ లోలపు రజిని సూచించారు. మండలంలోని అంబేడ్కర్‌నగర్ పాలకవర్గ సభ్యులు సర్పంచ్ మధురాబాయి అధ్యక్షతన శనివారం సమావేశమయ్యారు. పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో పాలకవర్గాన్ని ఎంపీపీ సన్మానించారు. కార్యదర్శి సునీల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది చేపట్టిన స్పాస్ (ఎస్‌ఏఏఎస్ఎస్) సర్వేను మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పరిశీలించారు. సర్వే ఈనెల 29 వరకు కొనసాగుతుందని, ఇప్పటి వరకు 8235 గృహాలను సందర్శించి వివరాలు సేకరించినట్లు ఆయన వెల్లడించారు. చిన్నారులు ఎలాంటి సమస్యలతో బాధపడుతున్నా సమీపంలోని కోటగిరి, పొతంగల్ ప్రభుత్వాస్పత్రులకు తరలించి చికిత్స చేయించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది రోజా, మంజుల, అనురాధ, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గుంటూరు కారం (తెలుగు) - 12.30, 7.00, 10.20 నా సామిరంగ (తెలుగు) - 3.50
స్క్రీన్-2 –	ఫైటర్ (హిందీ) 3డీ - 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 –	హనుమాన్ (తెలుగు)- 11.20, 2.40, 6.00, 9.20
స్క్రీన్-4 –	కెప్టెన్ మిల్లర్ (తెలుగు) - 12.50, 4.00, 10.30 హనుమాన్ (తెలుగు) - 7.10

క్లుప్తంగా

దత్తాపూర్‌లో ఎన్‌సీడీ సర్వే



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని దత్తాపూర్‌లో వైద్యారోగ్య శాఖ సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధుల సర్వే (ఎన్‌సీడీ)ను శనివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తించారు. ప్రభుత్వం నుంచి నెలకు సరిపోయే మందులు ఉచితంగా అందజేస్తామని, ప్రైవేట్‌కు వెళ్లి డబ్బులు వృథా చేయొద్దని సూపర్‌వైజర్ సురేందర్ సూచించారు. డొంకేశ్వర్ పీహెచ్‌సీకి వచ్చి అన్ని రకాల వైద్య సేవలు పొందాలన్నారు. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా స్వరూప



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన స్వరూపకు అవార్డు దక్కింది. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని స్వరూప అందుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణతోపాటు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేస్తున్నందుకుగాను స్వరూపకు అవార్డు దక్కింది.

వాలీబాల్స్, నెట్ వితరణ



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కంచి రవి, తుమ్మన పల్లి శ్రీనివాస్ జ్ఞాపకార్థం వారి మిత్రులు వాలీబా ల్స్, నెట్‌ను అందించారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహర్, పీఈటీ భూపతి, దాతలు రామకృష్ణ, సందీప్, దేవేందర్, సాయినాథ్, అర్జున్, నితిన్ పాల్గొన్నారు.

హోరాహోరీగా షటిల్ టోర్నీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో కేబీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఓపెన్ డబుల్స్, ఫర్టీ ప్లస్ ఏజ్ రెండు విభాగాల్లో వేర్వేరుగా నిర్వహిస్తున్న టోర్నీలో 67 జట్లు పాల్గొంటున్నాయి. ఆయా జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగుతోంది. శనివారం లీగ్, క్వార్టర్, సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు.

వారసంత ప్రారంభం

మాక్లూర్: మండలంలోని కల్లెడిలో శనివారం వారసంత ప్రారంభమైంది. ప్రజల అవసరాలను గుర్తించిన సర్పంచ్ లావణ్యాప్రసాద్‌గౌడ్ ప్రతి శనివారం వారసంత నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేసి సంతను ప్రారంభించారు. మొదటి రోజుకావడంతో వ్యాపారులు పెద్దగా రాలేకపోయారు. సంత ప్రారంభంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉర్సు ప్రారంభం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్‌లో ఉన్న సయ్యద్ షా రహమతుల్లా ఆలె దర్గాలో శనివారం ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొ దటి రోజు ఏసీపీ కిరణ్‌కుమార్, పట్టణ సీఐ దర్గాను సందర్శించి, మత పెద్దలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇబ్బందులు లేకుండా ఉర్సు ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఏసీపీ అన్నారు.

టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించిన విద్యార్థులు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మిసిమి హైస్కూల్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో భారత్ – ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌ను శనివారం వీక్షించారు. విద్యార్థులకు టెస్ట్ క్రికెట్‌పై ఆసక్తిని పెంచేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిరోజూ 5 వేల మంది విద్యార్థులకు ఉచితంగా టికెట్లు అందజేసి, భోజన వసతి కల్పిస్తున్నది.

ఉపాధ్యాయినిపై ఫిర్యాదు

నిజామాబాద్‌అర్బన్: వర్ని మండలం కోకల్‌దాస్‌తండా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల సమయం సాయంత్రం 4.15గంటల వరకు ఉండగా, సదరు టీచర్ శనివారం మధ్యాహ్నం 3 గంటలకే పాఠశాలకు తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్తం

సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

బోధన్: సాలూర మండలంలోని మందర్న గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ డ్రైనేజీ పనులను సర్పంచ్ రావుభా గంగాధర్, ఎంపీటీసీ శివకుమార్ శనివారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎంపీపీ బుద్దె సావిత్రీరాజేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యాన్ని పెంచుకోవాలి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు ఉత్తరాలు రాయడంలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హరిత సూచించారు. సమస్యలపై ప్రభుత్వానికి లేఖ రాయడం, పోస్టు చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాయించి పోస్టు చేయించారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: మెండోరా మండలం కోడిచర్లకు చెందిన చరణ్‌రాజ్ తండ్రి చిన్నయ్య గత కొంతకాలంగా వెన్నుపూస సమస్యతో బాధపడుతుండగా, చికిత్స నిమిత్తం రూ.2లక్షల ఎల్‌వోసీని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఎల్‌వోసీని శనివారం అందజేశారు. చిన్నయ్య కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

కమ్మర్‌పల్లి: 'జంతువుల సంరక్షణ, సామాజిక బాధ్యత' అనే అంశంపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో మొదటి స్థానంలో ఏ.బాలాజీ, ద్వితీయ స్థానంలో ఎండీ ఫైజాన్, తెలుగు మీడియంలో మొదటి స్థానంలో మారుతి నిలిచారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం సాయన్న, టీచర్లు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

రుద్రూర్: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పొతంగల్ మండలం కల్లూర్‌లో శనివారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 12 పశువులకు గర్భ నిర్ధారణ,10 పశువులకు గర్భకోశ చికిత్స, 35 పశువులకు సాధారణ చికిత్స చేశారు. 40 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. సర్పంచ్ వొల్లె లక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, మండల పశు వైద్యాధికారి సురేశ్‌కుమార్, జూనియర్ డాక్టర్లు రాజేందర్, ప్రకాశ్, అభిషేక్, వెటర్నరీ అసిస్టెంట్ సుధీర్‌గౌడ్, గోపాలమిత్రలు రియాజ్, సాయిలు, నగేశ్, తుకారాం, నాయకులు లింగప్ప, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆధార్ పనుల కోసం కోటగిరి, బోధన్ పట్టణానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బజరంగ్ హన్మాండ్లు, సతీశ్ మహరాజ్ తదితరులున్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ గుర్తింపు లేకుండా పట్టణంలో కొనసాగుతున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు నాయకులు జీవన్, కృష్ణ పాల్గొన్నారు.